క్లుప్తంగా

ఆర్టీసీ అద్దె బస్సులను ఉపయోగించుకోవాలి

రాజేంద్రనగర్: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోని లబ్ధిపొందాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ తెలిపారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభకార్యాలకు అద్దె బస్సులపై 10 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఇది గతంలో డిసెంబర్ 31 వరకు ఉండేదని ప్రజల సౌకర్యార్థం ఈ గడువును జూన్ 30 వరకు పొడగించిందన్నారు. వివరాలకు 99592 26135, 86390 04635, 99590 22753నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

నీటి సరఫరా లేకుండానే రూ.లక్షల్లో బిల్లులా?

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న మండలంలోని గ్రామాల్లో తాగునీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయకుండానే హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నుంచి రూ.లక్షల బిల్లులు జారీ కావడం తగదని చిన్న గోల్కొండ సొసైటీ డైరెక్టర్ గుర్రం అనంతరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ.. చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, రషీద్‌గూడ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో కొత్తగా నల్లాల కనెక్షన్లు ఇవ్వలేదని, నెలల కొద్ది తాగునీటి సరఫరా కూడా చేయడంలేదన్నారు.

వారిపై దేశ ద్రోహం కేసు పెట్టాలి


పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై దేశ ద్రోహం కేసు పెట్టి భారత దేశం నుంచి తరిమి వేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుల పోయిల జీవన్‌దాస్, వనం నర్సింహమాదిగలు అన్నారు. సోషల్ మీడియాలో వీడియో పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ ఏసీపీ, సిఐలకు ఫిర్యాదు చేశారు. టి.ఆర్.శ్రీరాములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ పనుల పరిశీలన



బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటు పాట్లు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పూర్తి చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. రాక్ చర్చ్ రోడ్డు గూండా నూతనంగా రూ.10 లక్షల వాటర్ ట్యాంక్ నుంచి ప్రశాంత్‌నగర్ సంపు వరకు 225 వాటర్ లైన్, పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యచరణతో పనులను చేపడుతున్నామన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అత్తాపూర్, ఈశ్వర్ థియేటర్, శివానగర్, కాంతారెడ్డినగర్, రాధానగర్, అంబియన్స్‌ఫోర్ట్, గాంధీ విగ్రహం తదితర ప్రాంతాల్లో ఈ కోత ఉంటుందన్నారు. మరమ్మత్తుల కారణంగా కోత విధిస్తున్నామని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నందున శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. బృందావన్ కాలనీ, గ్రేహౌండ్స్, మంచిరేవుల, వీరభద్రస్వామి దేవాలయం, శ్రీనగర్, ఎన్‌సీసీ అర్బన్, శ్రీ కృష్ణ గోశాల పరిధిలో పేర్కొన్న సమయంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై ప్రజా వ్యతిరేకత

అబిడ్స్: బీఆర్‌ఎస్, బీజేపీలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ, బీఆర్‌ఎస్‌ల అన్యాయాలు, అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా విజయం సాధిస్తుందన్నారు. గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

- ముగ్గురు నేరస్తులు అరెస్టు
- రూ.8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సొత్తును పరిశీలిస్తున్న డీసీపీ సాయిశ్రీ


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

నాగోలు: తాళాలు వేసిన ఇండ్లను లక్ష్యంగా చేసుకుని రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను మీర్‌పేట్ పోలీస్‌లు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 8 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎల్‌బీనగర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపిన మేరకు.. అంబర్‌పేట, రామంతపూర్, గణేష్‌నగర్ కాలనీ చెందిన మునితన్ ఆకాష్‌కుమార్(21) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లికి చెందిన పోలోజు అభిలాష్(24) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన చిలుకూరు సందీప్‌కుమార్(23) ర్యాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆకాష్‌కుమార్‌ను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరధిలో పోక్సో కేసులో అరెస్టుచేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. అభిలాష్‌ను చోరీ కేసులో పోలీస్‌లు అరెస్టు చేసి జువైనల్ అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించారు. ఇద్దరూ అక్కడ కలసి మంచి స్నేహితులయ్యారు. హోమ్‌నుంచి వచ్చిన తరువాత సందీప్‌కుమార్‌తో పరిచయం పెంచుకున్నారు. ముగ్గురూ చిన్న చిన్న దొంగతనాలు చేసే వారు. ఈ క్రమంలో రాత్రి పూట తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనాలకు చేసేవారు. మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రిపూట ఓ ఇంట్లో చోరీ చేశారు. ఆర్ఎన్ రెడ్డినగర్‌కు చెందిన సతీష్ ఇంట్లో చోరీ చేశారు. ఊరెళ్లిన వారు ఫిబ్రవరి 5 వ తేదీన తిరిగి వచ్చే సరికి ఇంటికి తాళం పగులగొట్టి అతని ఇంట్లో బంగారు, వెండి ఆభరణాలు, నగదు మాయమైనట్లు గమనించారు. దీంతో బాధితుడు మీర్‌పేట పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం బాలాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద నిందితులు దొంగిలించన వస్తువులతో పారిపోతుండగా పోలీస్‌లు వారి అరెస్టు చేసి వారి వద్ద నుంచి 87 గ్రాముల బంగారు ఆభరణాలు, 928 వెండి అభరణాలు, సోనీ హ్యాండ్ కెమెరా, మెటర్ సైకిల్‌ల స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఆకాష్‌కుమార్‌పై నగరంలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలోని 8 జువైనల్ కేసులు నమోదయ్యాయి, సందీప్‌కుమార్ పైప పలు కేసులు ఉన్నట్లు పోలీస్‌లు తెలిపారు. కేసును చేధించిన సిబ్బందికి డీసీపి రివార్డులు అందజేశారు.

అన్నపూర్ణ కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఆర్థికభారం అంటు పట్టించుకోని మున్సిపాలిటీ
- పట్టణంలో లక్షకు పైగా జనాభా
- వివిధ పనుల కోసం వచ్చేవారి సంఖ్యలో వేలల్లోనే

శంషాబాద్: బల్దియా, స్వచ్ఛందసంస్థల సహకారంతో నగరంలో పేదల ఆకలిని తీరుస్తున్న అన్నపూర్ణ కేంద్రం శంషాబాద్‌లో మాత్రం అందని ద్రాక్షగానే ఉంది. సుమారు లక్షకు పైగా జనాభా ఉన్న శంషాబాద్ పట్టణానికి ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాణిజ్య కేంద్రాలు, పరిశ్రములు సైతం ఉండడంతో కార్మికులు, రోజువారీ కార్మికుల సంఖ్య కూడా పట్టణంలో వేలసంఖ్యలోనే ఉంది. మున్సిపాలిటీ ఏర్పాటై మూడేళ్ల కావస్తున్నా స్థానికంగా రూ. 5 భోజనం అందించే అన్నపూర్ణ కేంద్రం ఏర్పాటుపై మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

ఆర్థికభారం అంటూ..

స్వచ్ఛందసంస్థ నిర్వహించే అన్నపూర్ణ కేంద్రానికి సగరం ఖర్చును స్థానిక మున్సిపాలిటీ భరించాల్సి ఉంటుంది. నెలకు కనీసం రూ. 5 లక్షలు వ్యయంగా మారుతుందని అంచనాలు వేసిన అధికారులు దానిని పట్టాలెక్కించేందుకు అయిష్టంగానే ఉన్నారు. మున్సిపాలిటీ ఈ వ్యయం కాస్తా ఆర్థికభారంగా మారుతుందనే అభిప్రాయంతో ప్రజల నుంచి విన్నపాలు, ప్రతిపాదనలు వచ్చినా పట్టించుకునేందుకు ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నపూర్ణ కేంద్రం ఏర్పాటుతో అనేక మంది కార్మికులు, డ్రైవర్లు ఇతరత్రా చిరుద్యోగులకు తక్కువ వ్యయంతో కడుపు నింపుకునే అవకాశముంటుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ అధికారులు అన్నపూర్ణ కేంద్రాన్ని త్వరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


శంషాబాద్ పట్టణంలో నిత్యం పనికోసం వచ్చే భవన నిర్మాణకార్మికులు

కేసీఆర్ ప్రభుత్వం అంకెల గారడీతో మోసం చేస్తోంది


కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంకెల గారడితో ప్రజలను మోసం చేస్తోందని మైలార్‌దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి కేవలం 30 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రేటర్ మున్సిపల్ బీజేపీ కార్పొరేటర్లు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను అరెస్టు చేసిన పోలీసులు నగరంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఘనంగా అబ్దెశి సదాలక్ష్మి జన్మదిన వేడుకలు



మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షురాలు అబ్దెశి సదాలక్ష్మి జన్మదినోత్సవాలను పురస్కరించుకొని శివరాంపల్లిలోని అనాథాశ్రమంలో ఘనంగా జన్మదినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అనాథాశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆశ్రమంలో ఉంటున్న వారికి భోజనాన్ని ఏర్పాటు చేశారు.

పేద ప్రజల అభ్యున్నతికి బీజేపీ కృషి


సమావేశంలో మాట్లాడుతున్న వక్త

బండ్లగూడ: భారత ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతికి బాటలు వేస్తామని బీజేపీ స్పోక్స్ పర్సన్ సి.హెచ్.విఠల్ అన్నారు. ప్రజా గోస– బీజేపీ భరోసా రాష్ట్రవ్యాప్తగా శక్తికేంద్ర స్థాయి కార్నర్ సమావేశాలు శుక్రవారం ప్రారంభమైయ్యాయి. రాజేంద్రనగర్ నియోజవర్గం మొత్తం కలిసి మొదటి శక్తికేంద్ర కార్నర్ మీటింగ్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాళీమందిర్ అమ్మవారిని దర్శించుకొని ప్రారంభించారు.

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ శక్తికేంద్ర స్థాయి కార్నర్ సమావేశాన్ని కార్పొరేషన్ బీజేపీ పార్టీ అధ్యక్షులు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్పోక్ పర్సన్ సి.హెచ్.విఠల్, శక్తికేంద్ర ఇన్‌చార్జీ నర్సింగ్‌గౌడ్‌లు హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులైన పేద ప్రజలకు అందేలా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు విజయ్‌కుమార్, అశోక్, మల్లేష్‌యాదవ్, కోకన్వీనర్ మహాలింగంగౌడ్ పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అంజలి గార్డన్ వద్ద వాహనాలు వేగంగా వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నాయని, వాటి వేగాన్ని నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్ జీ సర్కిల్ నుంచి పుప్పాలగూడ పెట్రోల్ పంప్ వరకు ఇటీవల రోడ్డుకు మరమ్మత్తులు చేయటంతో వాహనాలు ఉదయం, సాయంత్రం వేగంగా వెళుతున్నాయని వారు పేర్కొన్నారు. గురువారం రాత్రి రెండు కార్లు ఢీ కొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయని, వెంటనే అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

చౌదరిగూడలో సామూహిక సీమంతాలు



శంషాబాద్ రూరల్: మండలంలోని చౌదరిగూడలో శుక్రవారం సర్పంచు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తనీ ర్వరాజు హాజరై మాట్లాడారు. గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు గౌతమి, సంగీత, అడ్వకేట్ శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు.

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గణేష్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘు ముఖ్య అతిధిగా హాజరు. ప్రతి విద్యార్థి తమ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక ఆర్థిక స్థితి గతులపై అవగాహన పెంచుకోని అందరిని అప్రమత్తం చేయాలన్నారు. ప్రజ్వల సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బాలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ ప్రారంభం


సదస్సులో మాట్లాడుతున్న అధ్యాపకుడు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ విద్యార్థి విభాగాన్ని ప్రారంభించారు. అల్ట్రాటెక్ సిమెంట్ సహకారంతో 'ఆధునిక కాంక్రీట్, రెట్రోఫిట్టింగ్ టెక్నిక్ లు'అనే అంశంపై ఒక రోజు హైబ్రీడ్ మోడ్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవసరమైన నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ ప్రాంతీయ హెడ్ శ్రీనివాసరావు, ఎస్‌వీఎల్ఎస్ నిర్మాణ సంస్థ ప్రతినిధి ఐశ్వర్య గుప్తా, ప్రొఫెసర్ జగన్నాథరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మల్లయుద్ధం పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న ముఖేష్‌గౌడ్ మల్లయుద్ధం రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. 2వ రోజు శుక్రవారం అండర్ 15–17 విభాగాలతో పాటు పురుషుల సీనియర్ విభాగంలో 55, 60, 66 కేజీల క్యాటగిరిల్లో పోటీలు రసవతరంగా సాగాయి. ఈ సందర్భంగా కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, మల్లయుద్ధం పోటీలను అభినందిస్తూ ఒక వీడియో సందేశాన్ని పంపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పెద్ద ఎత్తున పోటీలను నిర్వహించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. శ్రేష్ఠ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ.. మల్లయుద్ధం పోటీల్లో అమ్మాయిల కోసం ప్రత్యేకంగా చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సామూహిక ఉపనయనాలు

శంషాబాద్ రూరల్: శ్రీరామనగరంలో జరుగుతున్న సమతా కుంభ్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక ఉపనయనాలు నిర్వహించారు. శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు జీయర్ స్వామి ప్రవచనం చేశారు. సాకేత రామచంద్ర స్వామికి గజవాహన సేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాల్లో అహోబిల జీయర్‌స్వామి, దేవనాథ జీయర్‌స్వామి పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


ప్రజల ఫిర్యాదులపై స్పందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీకి బయలుదేరుతుండగా కార్వాన్, లంగర్‌హౌస్ డివిజన్ల నుంచి పలువురు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. పలు కార్యాలయాల్లో తమ దరఖాస్తులపై ఎమ్మెల్యే సంతకం కావాలని అధికారులు అంటున్నారని దరఖాస్తులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తులపై వెంటనే సంతకం చేసి ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 3 దశాబ్దాలకు పైగా తాను ప్రజాసేవలో ఉన్నానని, ప్రజలు ఏమి కోరుకుంటున్నారో అది తెలుసుకుని ఆ పనులను వెంటనే చేస్తున్నానన్నారు. ఇందులో భాగంగానే ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో మీ సేవలో మజ్లిస్, గడపగడపకు మజ్లిస్ కార్యక్రమాలను ప్రారంభించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తునానన్నారు. జల మండలి, బల్దియా అధికారుల పనితీరుపై కూడా తనకు ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, అయితే తాను ఆ అధికారులతో మాట్లాడి వారు ప్రజలకు పని దినాల్లో వారి వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండేలా చూస్తున్నామన్నారు. నేడు జలమండలితో పాటు బల్దియా, విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా తాను సైతం ఫిర్యాదులపై స్పందించి ఎంత రాత్రైనా సరే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నానన్నారు.

'ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీఆర్‌ఎస్ చిత్తుగా ఓడించడం ఖాయం'

అబిడ్స్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్‌ను బీఆర్‌ఎస్ పార్టీ చిత్తుగా ఓడించడం ఖాయమని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజాసింగ్ బీఆర్‌ఎస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు తెలిపారు. ఓటుకు రూ.లక్ష ఇచ్చినా బీఆర్‌ఎస్ గెలవదని ఎమ్మెల్యే రాజాసింగ్ అహంకారంతో వ్యాఖ్యలు చేశారన్నారు. బీఆర్‌ఎస్ వెయ్యికోట్లు ఖర్చుచేసినా తానే నెగ్గుతానని రాజాసింగ్ పేర్కొనడం దారుణమన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు, అభివృద్ధితోనే గోషామహల్‌లో రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామన్నారు. ఓట్ల కోసం నోట్లు ఇచ్చే సంస్కృతి తమది కాదని, ప్రజాధరణతోనే విజయం సాధిస్తామని ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు.

సందడిగా వార్షికోత్సవం


ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

గోల్కొండ: టోలిచౌకి సూర్యనగర్ కాలనీలోని బచ్‌పన్ అండ్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బచ్‌పన్ ఏహెచ్‌పీఎస్ రీజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తెలియజేసే విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులకు దేశం గురించి, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్‌పన్ కో ఆపరేటివ్ డైరెక్టర్ విజయ్ గుప్తా, డైరెక్టర్లు మురళీధర్‌రెడ్డి, ఇందూలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జుంబా ఫిట్‌నెస్, గోవా థీమ్, మైఖేల్ జాక్సన్ థీమ్ ఆకట్టుకున్నాయి.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: సరళమైన భాషలో ఆధునిక కవిత్వాన్ని రచించడం ఎంతో ప్రశంసనీయమని పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాంక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం రవీంద్రభారతిలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన కండీషన్ సప్లయ్ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటికీ సమాజంలో ఉన్న కుల వివక్షతను కథల రూపంలో చక్కగా వివరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఎస్‌సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గంట చక్రపాణి, సినీ దర్శకుడు ఊడుగుల వేణు, కథా రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కథకురాలు తోట అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


గోల్కొండ కోట వద్ద కారు డ్రైవింగ్‌తో ధ్వంసమైన తోపుడు బండి

గోల్కొండ: అహ్మద్‌నగర్, మెహిదీపట్నం, టోలిచౌకి తదితర ప్రాంతాల్లో తెల్లవారు జాము, రాత్రి 10 తరువాత మైనర్లు కార్లు తీసుకుని రోడ్లపై అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేస్తున్నారు. శిక్షకులు లేకుండానే వీరు అతివేగంగా కారు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం షేక్‌పేట్ ఫ్లై ఓవర్ వద్ద ఓ మైనర్ తెల్లవారు జాము కారునడపుతూ ఫ్లై ఓవర్ పిల్లర్‌ను ఢీకొట్టారు. అదే విధంగా శుక్రవారం ఉదయం గోల్కొండ కోట బాలహిస్సార్ బస్టాప్‌లో ఇద్దరు మైనర్లు కారుతో వచ్చి స్థానికులను పరేషాన్ చేశారు. ఆ సమయంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు వేగంగా వస్తున్న కారును చూసి పరుగులు తీశారు. కారు నడుపుతున్న ఓ మైనర్ బాలుడు అదుపుతప్పి బస్టాప్ పక్కన ఉన్న ఓ తోపుడు బండితో పాటు జ్యూస్ సెంటర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో జ్యూస్ సెంటర్ పూర్తిగా ధ్వంసం కాగా తోపుడు బండి కూడా పనికిరాకుండా పోయింది.